# మచ్చతేలిన చంద్రుడు



రాజమండ్రి నుంచి ఏలూరు వెళ్తున్న బస్సు మండువేసవిలో గుక్కెడు నీళ్ళు కరువైన చోట మున్సిపాలిటీ వాటర్ టాంక్‌లా నిడదవోలులో ఆగింది. దాని చుట్టూ బిందెలతో మూగినట్లుగా తమ తమ లగేజీలతో చేరారు జనం.

"ఏమండీ! కొంచెం మీ ప్రక్కన ఈ రుమాలు వేయరూ?"

''ఈ టవల్ మీ వెనుక సీట్లో వేయండి. ముగ్గురం. ప్లీజ్!''

"సోడా... నిమ్మసోడా!"

"మూర రెండు రూపాయలు బాబూ! మల్లెపూలు సార్... మల్లెపూలు'' లాంటి అరుపులతో చెవులు గళ్లడిపోతున్నాయి.

టూ సీటర్‌లో డోర్‌వైపు కూర్చున్న నేను ఎవరైనా పెద్దమనిషికి సీటు ఇవ్వవచ్చు ననే ఉద్దేశ్యంతో - హేండ్ కర్చీఫ్ ప్రక్కసీట్లో వేశాను.

భగీరథుడికి ఆఖరి క్షణంలో తపస్సు ఫలించిన విధంగా, నా వేటలో, బస్సెక్కిన ఆ మెరుపుతీగ అందమూ, ఆకర్షణ నన్ను అచేతనుడిని చేశాయి. నిండైన అప్సరసలా ఉందామె. ఒక్క మాటలో చెప్పాలంటే అంతటి అందగత్తెను నేను ఎన్నడూ చూడలేదు.

"అంకుల్! ఇక్కడ ఎవరైనా ఉన్నారా?" జనం మధ్య సన్నని జాగాలోంచి నల్లని దుస్తులలో సౌందర్యమంతా బంధించిన ఆమెనే చూస్తున్న నేను ఆ ప్రశ్నవిని ఉలిక్కిపడ్డాను.

నేను మాట్లాడకపోవడంతో అందంగా ఉన్న ఆ అబ్బాయి హేండ్‌కర్చీఫ్ తీసి నాచేతికియిచ్చి పర్మిషన్ అవసరం లేనట్లుగా కూర్చున్నాడు.

బస్ స్టార్టయింది.

అందం నా ప్రాణం. అందమైన నా పేరంటే నాకు ఎంతో ఇష్టం.

నూటికి అయిదుగురు అందగాళ్లను సెలెక్టుచేస్తే ఖచ్చితంగా వారిలో నేనుంటాను.

నా కున్న కొద్దిపాటి బట్టతల, సొట్టలుపడే ఎర్రని బుగ్గలు, పచ్చని శరీరంపై మగటిమిని గుర్తు చేసే రోమాలు, తెల్లని పలువరుస, తళుక్కుమనేలా ఎలాంటి అలవాటు లేని లేత గులాబీ పెదవులు, 'భలేగా వుందే' అనిపించే మీసం... ఇదీ నా అందం.

జేబులోని దువ్వెన తీసుకుని ఆమెను గమనిస్తూనే వున్న జుట్టును దువ్వుకున్నాను.

ఆమె వెనుదిరిగి బస్సంతా కలియ జూసింది. ఆమె చూపు నామీద నిలిచింది. నన్ను ఎక్కడో చూసిన దానిలా ఆమె భృకుటి ముడి పడింది. ఒక్కక్షణం అంతలోనే తన చూపు విడదీసుకుని పక్కకు తిరిగిపోయింది.

ఇటు తిరిగినప్పుడల్లా ఆమెను దాచుకున్న నల్లని దుస్తులు బంగారు ఛాయలో మెరుస్తున్న ఆమె అందానికి మరింత బిగువునిస్తున్నాయి. ఆమె గుండ్రటి ముఖానికి కళ్లజోడు అతికినట్లుగా సరిపోయింది.

ఒబ్బిడితనమంతా తనలో దాచుకున్నట్లు నడుము దాటిన పొడువాటి జడలో అప్పుడే విచ్చుకుంటున్న పందిరిమల్లెలు నన్ను చూసి వెక్కిరిస్తున్నట్లుగా నవ్వుతున్నాయి.

ఆమె గుండెలపై వ్రేలాడుతున్న నల్లపూసల తావళంలోని లక్ష్మీదేవి నన్ను శపిస్తున్నట్లుగా స్పష్టంగా అనిపించసాగింది.

"అంకుల్ మీరే ఊరు వెళుతున్నారు?" నా ప్రక్క బాబు నా చేయి పుచ్చుకుని గుంజడంతో అతనివైపు తల తిప్పాను.

"తాడేపల్లిగూడెం. అది సరేగానీ నువ్వు చాలా బాగున్నావు. నీ పేరు?" అడిగాను నేను నవ్వుతూ.

"భార్గవ్‌రామ్ మీ పేరు?"

"చంద్రకుమార్. మీ ఫాదర్ ఏం చేస్తున్నారు?"

"బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా - ఏలూరులో పనిచేస్తున్నారు."

"అచ్చా! ఏం చదువుకుంటున్నావు?"

"టెన్త్ క్లాస్! మీరేం చేస్తున్నారు అంకుల్?"

"ఎల్ఐసిలో"

నేను సమాధానాలు చెప్తూనే ఉన్నాను. అంతమందిలో ఆమె నన్ను మురిపిస్తూనే ఉంది.

ఆమె మీద హక్కు వుంటే పాలమీగడ తరకలాంటి ఆ అందాన్ని వేరే చెయ్యి కడగనవసరం లేనంతగా జుర్రేసేవాడిని.

"అబ్బా.. అటేం చూస్తారు? నాతో కబుర్లు చెప్పండంకుల్."

నేను ఉలిక్కిపడ్డాను.

నా వేటలో మొదటిసారి దొరికిపోయా. అదీ ఒక చిన్నకుర్రవాడికి.

"ఆంటీ చాలా బాగుంది కదూ?"

"...." ఆ అబ్బాయి నవ్వాడు. ఆ నవ్వులో తడికన్నా పొడి ఎక్కువ.

మరోసారి ఉలిక్కిపడ్డాను.

ఆ బాబు భుజం చుట్టూ చేయివేసి ఆప్యాయంగా పొదివి పట్టుకున్నాను.

"నిజంగా నేను బాగున్నానా?"

"మా డాడీలా చాలా అందంగా ఉన్నారు."

అతని డాడీని చూడకపోయినా ఒక్కక్షణం ఆకుర్రవాడు చమత్కారానికి మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

సరిగ్గా ఆమె ఆ క్షణంలో నాకేసి చూసింది.

"నువ్వు నాకు బాగా నచ్చావు" ఆమెకేసి చూస్తూ ఆ అబ్బాయితో ద్వందార్థంగా అన్నాను.

"అలాగా. ఏం? మీకు పిల్లలు లేరా అంకుల్?" చేతకాని వాడిని చూస్తున్నట్టు చూస్తూ అడిగాడు.

"ఉన్నారు!.. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి."

"అయితే భయ్యా ఏం చదువుతున్నాడు, సిస్టర్ ఏం చదువుతోంది?"

"బాబు నైన్త్, సిస్టర్ టెన్త్! మా అబ్బాయినీలాగే, నీ కలర్‌లోనే వుంటాడు" తల నిమరబోయాను.

"ఇది హీరో వినీత్ స్టయిల్ అంకుల్. ప్లీజ్ ముట్టుకోకండి."

"అచ్చా! మరి నీకు హీరోయిన్స్‌లో ఎవరిష్టం?" అడిగాను ఆశ్చర్యం ప్రకటిస్తూ.

"ఛీ...హీరోయిన్స్ అంటే నాకిష్టం వుండదు అంకుల్. వాళ్లవల్ల సమాజంలో ఆడదానికి వున్న గౌరవం కూడా పోతోంది" అన్నాడు పెద్ద ఆరిందాలా.

నవ్వొచ్చింది నాకు.

"పోనీలే. పెళ్ళికాని అమ్మాయిలు బాగుంటారా? పెళ్ళయిన ఆంటీలు బాగుంటారా?"

"ఏమో నాకేం తెలును?" అని ఒక్కక్షణం ఆలోచించి అన్నాడు.

"మా అక్క ఉసూరుమంటూ ఉంటుంది. మాకైతే మా మమ్మీయే బాగుంటుంది సరస్వతీదేవిలా"

"అయితే ఆ ఆంటీలో నీకు ఏం నచ్చింది?" తెలివిగా సంభాషణను నాకు కావాల్సిన వైపుకి మలుస్తూ అడిగాను.

"ఊ... అమ్మ. ఆ ఆంటీలో 'అమ్మ' నాకు నచ్చింది. అయినా ఇవేం ప్రశ్నలు అంకుల్. చిన్నపిల్లల్ని అడిగే ప్రశ్నలేనా ఇవి?" అని తల విసురుగా తిప్పి బయటకు చూడసాగాడు.

అంతలోనే నాకేసి తిరిగి "సరేగానీ! మీరు తాడేపల్లిగూడెంలో ఎక్కడ ఉంటున్నారంకుల్?"

"డఫేదార్ వీధిలో. దత్తసాయి నిలయం అని అడిగితే ఎవరైనా చెబుతారు."

"అయితే నేనెప్పుడైనా సెలవులకి మీ ఇంటికి రావచ్చా అంకుల్?"

"ఓ... భేషుగ్గా!"

"భయ్యాతో, సిస్టర్‌తో ఆడుకోవచ్చా!"

"ఊ!"

"అయితే నాకు అడ్రస్ ఇవ్వరా అంకుల్!"

ఆ అబ్బాయి అడిగిన తీరుకి వెంటనే పర్సు తీసి నా విజిటింగ్ కార్డు అతనికిచ్చాను. ఆ బాబు తన స్కూలు విశేషాలన్నీ చెబుతున్నాడు. నేను ఊ కొడుతూ, ఆమె అందాన్ని ఆస్వాదిస్తూ వున్నాను.

ఈ హడావుడిలో తాడేపల్లిగూడెం తాలూకా ఆఫీసు సెంటర్లో బస్సు ఆగడం జరిగింది.

"ఓకే బాబూ! మా ఇంటికి తప్పనిసరిగా రా!" ఆ బాబు బుగ్గమీద చిటికేసి ముందుకు నడిచాను.

ఎలాగైనా ఆమెను ఒకసారి తాకాలన్న నా కోరిక అడియాసే అయింది.

ఆమెకు సీటు దొరికి కూర్చుంది. ఆమెను చూస్తూనే దిగబోయిన నేను కాలు స్లిప్ అయి పడబోయాను. ఆమె విసురుగా ముఖం తిప్పుకోవడంతో చెక్కిళ్లని జడలోని మల్లెలు తనివితీరా ముద్దాడాయి.

"టాటా అంకుల్!" భార్గవ్‌రామ్ చేయి ఊపుతున్నాడు.

నేనూ చేయి ఊపాను.

★★★

పదినిమషాలలో బజారుపని చూసుకుని జెడ్పి హైస్కూల్ ప్రక్కసందులోంచి ఇంటి దారి పట్టాను.

సాయంత్రం ఏడుగంటలు అయింది.

పట్టుకుచ్చులాంటి అందంతో ఆమె రూపం నన్ను తొలిచేస్తోంది. నాకున్న వీక్‌నెస్ "అందమైన ఆడది"

నాలో పైకి కనిపించని మచ్చ నా బలహీనత. ఆ మచ్చ పైకి కనిపించనంత కాలం నేను పవిత్రుడనే.

'మచ్చ'లేని మానవుడే వుండడేమో!

మా ఆఫీసులో నేను ఎంతో సంస్కారవంతుడన పేరు తెచ్చుకున్నాను.

ఆలోచిస్తూ వాననీటితో నిండిన గొయ్యిలో చూసుకోకుండా కాలేసాను. అది బాగా లోతుగా వుండడంతో ఎడమకాలు మడతపడి స్లిప్ అయిపడిపోయాను. బట్టన్నీ బురదమయం. లేచి సరిగా నిలబడలేక పోయాను.

వీధిదీపపు కాంతిలో దూరం నుంచి వస్తున్న రిక్షాలోని వ్యక్తులు తప్ప ఆ సందులో నన్ను చూసినవారెవరూ లేరు. హమ్మయ్యా అనుకున్నాను.

కాలు కలుక్కుమంది. బాగా నొప్పి చేసేసింది.

ఒక్క అడుగు ముందుకు వేసేసరికి బాధ భరించలేక ఒక్కక్షణం అలాగే నిలబడిపోయాను.

రిక్షా నా ప్రక్కనుంచి వెళ్తూండగా ఓ గుండ్రని వస్తువు నా నుదుట బలంగా తాకింది. అంగుళం మేర చీరుకుపోయి ధారగా కారుతున్న రక్తంతో చొక్కా తడవసాగింది.

రిక్షా చక్రం స్లిప్ అవడంవల్ల పైకి లేచిన నునుపాటిరాయి కాబోలు అనుకున్నాను.

నా మెదడు మొద్దుబారిపోయింది. రక్తం అంటే నాకు విపరీతమైన భయం. హేండ్ కర్చీఫ్‌తో గాయం నొక్కిపట్టి ఎలా ఇల్లు చేరానో నాకే తెలియదు.

★★★

నుదుట మూడు కుట్లు పడ్డాయి.

కాలు బాగా నొప్పి చేసి వాచిపోవడం, జ్వరం కూడా రావడంతో వారం రోజులు లీవ్ పెట్టేశాను.

నా ముఖం స్టాఫ్‌కి ఎలా చూపాలో తెలియలేదు. ఈలోగా విషయం తెల్సిన ఒక్కొక్కరు వచ్చి పలకరించడంతో స్కూటర్ యాక్సిడెంట్ అని తప్పించుకున్నాను.

కుట్లు విప్పినా, నా నుదుట మచ్చ అరటి పువ్వు రంగులో శాశ్వతంగా మిగిలిపోయింది.

'మచ్చ తేలిన చంద్రుడిలా.'

★★★

ఆఫీసులో జాయిన్ అయినరోజు నా టేబుల్‌మీద ఓ కవరు కనిపించింది. దానిమీద అప్పటికి మూడురోజులు క్రితం డేట్ స్టాంపు ఉంది. హేండ్‌రైటింగ్ అందంగా వున్నప్పటికీ నాకు పరిచయం అయినది మాత్రం కాదు.

చింపి చదవడం మొదలుపెట్టాను.

అందులో ఇలా వుంది.

"అంకుల్!"

నేను భార్గవ్‌రామ్‌ను, గుర్తు కు

వచ్చానా?" ఆ రోజు మీరు నాతో మాట్లాడిన మాటలు గుర్తుకు తెచ్చుకుంటే అసలు మీరో కన్నతండ్రేనా అనిపించింది నాకు. పరాయి స్త్రీ గురించి మీరు నన్ను అడిగిన ప్రతి ప్రశ్నా మీ అబ్బాయిని అడిగినట్లు ఊహించుకోండి. అడగలేరుకదూ. మీ అబ్బాయికి మీరు నేర్పే సంస్కారం అదా? మీ భార్యని అలా కామెంట్ చేస్తే మీరు భరించగలరా? పెద్దవాళ్లతో పరిచయాలు పెంచుకుంటే వారి అనుభవాలు జీవితానికి ఎంతో ఉపయోగపడతాయని మమ్మీ నన్ను ఎంతో ప్రోత్సహిస్తుంది. అలా మీ నుంచి మంచి విషయాలు తెలుసుకుందామనుకున్న నాకు, ఏ కొడుకు తన తల్లిని గురించి పరోక్షంగానైనా వినకూడని కామెంట్స్ మీ నుంచి వినే ఖర్మ పట్టింది. బస్సులో మీరు కామెంట్ చేసిన ఆ ఆంటీ ఎవరో కాదు. నా కన్నతల్లి! మీ అంతటి నీచమైన మగాడిని నేను ఎన్నడూ చూడలేదు.

విపరీతమైన కోపం వచ్చింది మీమీద. మీ అందం పట్ల మీకున్న నమ్మకంమీద గట్టి దెబ్బ కొట్టాలనుకున్నాను. కానీ మీరు బస్సు దిగి వెళ్తుంటే నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాను.

మా అత్తయ్యగారింటికి వెళ్తున్నాము మేము. వాళ్ళ ఇల్లు డిఎస్ చెరువుదగ్గరలో. రిక్షాలో వస్తున్న మాకు యాదృచ్ఛికంగా మీరు గోతిలో పడి లేవడం కనిపించింది. అమ్మ మిమ్మల్ని చూసి రిక్షా ఆపి సహాయం చేద్దామంది. కానీ నేను ఒప్పుకోలేదు. రిక్షా మీ దగ్గరకు వస్తుండగా అమ్మ చూడకుండా నా బలంకొద్దీ నా క్రికెట్‌బాల్ మీ మీదకు విసిరేసాను. అదీ సంగతి.

మీలాంటి తండ్రి వున్న భయ్యా, సిస్టర్‌లు చాలా దురదృష్టవంతులు. వారిని చూడకుండానే బాధపడుతున్నాను. అన్నింటిలో వన్నెగా వుండే నాకు మరచిపోలేని అసహ్యకరమైన అనుభవంలా, మనిషి అందంపట్ల ఏహ్యాభావం కలిగేలా ప్రవర్తించారు మీరు.

దయచేసి మరే తల్లినీ ఆమె పిల్లల ముందే కామెంట్ చేయకండి. ఉంటాను.

-భార్గవ్‌రామ్"

మనసులో సుళ్ళు తిరుగుతున్న పశ్చాత్తాపం కన్నీళ్ళ రూపంలో ప్రక్షాళనం చేస్తుంటే ఆ పిల్లాడు పడిన మానసికక్షోభను తలచుకుంటూ చేతులమీద తలవంచుకుని మౌనంగా వుండిపోయాను.

నా 'అందం' మీద విజయం సాధించిన 'మచ్చ' నా నుదుట వెక్కిరిస్తూ శాశ్వతంగా నిలిచిపోయింది. ●

'ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక'
07-10-1999